
# అంతా రామమయం

## ప్రాణప్రతిష్ఠ, ప్రారంభోత్సవానికి అయోధ్య సిద్ధం

## విద్యుత్తు కాంతులతో వెలిగిపోతున్న రామాలయం

## దేశమంతటా భక్తి భావం.. పండగ వాతావరణం

*జగదానంద కారకుడి ప్రాణ ప్రతిష్ఠ దగ్గరపడిన వేళ జగమంతా రామమయమైంది! రామ నామ స్మరణతో అయోధ్యతో పాటు దేశమంతా భక్తిభావంతో నిండిపోయింది. దేశ విదేశాల నుంచి విలువైన, అపురూపమైన కానుకలు రామయ్య సేవ కోసం తరలివచ్చాయి. విద్యుత్తు కాంతులు, సహజ సుందరమైన పుష్పాలంకరణలతో అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి అందంగా ముస్తాబైంది.*



ప్రారంభోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైన అయోధ్య రామాలయం

అయోధ్య, జనవరి 20: శతాబ్దాల పోరాటం విజయవంతమై, శ్రీరాముని కోసం కన్న కలలు సాకారమయ్యే ఘడియలు సమీపిస్తున్నాయి. ఎప్పుడెప్పుడు శ్రీరాముడిని దర్శించుకుందామా అనే ఆత్రుత, భక్తి భావన అందరిలోనూ పెరుగుతున్నది. సోమవారం జరిగే బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అయోధ్యలో మాత్రమే కాకుండా దేశ విదేశాల్లో కూడా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయోధ్య ఆలయానికి చేసిన పూల అలంకరణలు దైవత్వ భావాన్ని మరింత పెంచుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. ఈ అలంకరణలతోపాటు సంప్రదాయం ఉట్టిపడుతూ, మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపాల కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రామాలయంలోని గర్భగుడిలో సంప్రదాయబద్ధమైన దీపాన్ని మాత్రమే వెలిగిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు చెప్పారు. అయోధ్య అంతా రామమయం అయిపోయిందని భక్తులు ఆనంద తాండవం చేస్తున్నారు.

### పవిత్ర జలాలతో గర్భ గుడి సంప్రోక్షణ

పుష్పాధివాసం పూజల్లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చక్కెర, పూలను శనివారం బాల రామునికి సమర్పించారు. దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాల నుంచి 81 కలశాల్లో తీసుకొచ్చిన పవిత్ర జలాలతో బాల రాముని విగ్రహాన్ని, గర్భగుడిని సంప్రోక్షణ చేశారు.

### ప్రాణ ప్రతిష్ఠ పూజలో 14 మంది దంపతులు

బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ పూజలో 'యజమానులు'గా సోమవారం 14 మంది దంపతులు పాల్గొంటారు. దేశంలోని ఉత్తర, తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఈశాన్య ప్రాంతాల నుంచి వీరిని ఎంపిక చేశారు. రామాలయం నిర్మాణం కోసం అన్ని ప్రాంతాలవారు పోరాడిన నేపథ్యంలో ఈ విధంగా వివిధ ప్రాంతాల నుంచి యజమానుల ఎంపిక జరిగింది.

### రామాలయం వద్ద బుకింగ్

రామాలయానికి వెళ్లిన రోజునే దర్శనం, హారతి కోసం బుక్ చేసుకోవచ్చు. అయితే స్లాట్ లభ్యతనుబట్టి పాస్ ఇస్తారు. హారతి షెడ్యూలు సమయానికి 30 నిమిషాల ముందు భక్తులు క్యాంప్ ఆఫీస్ వద్ద హాజరు కావాలి.హారతి పాస్‌లను పొందడం కోసం ప్రభుత్వం జారీ చేసిన చెల్లుబాటయ్యే ఐడీ కార్డులను చూపించాలి.

### ఆహ్వాన పత్రిక ఉన్నా ఎంట్రీ పాస్ తీసుకోవాల్సిందే

బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వాన పత్రిక ఉన్నవారు తప్పనిసరిగా ఎంట్రీ పాస్‌ను తీసుకోవాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రకటించింది. ఆహ్వానితులకు వాట్సాప్ ద్వారా ఓ లింక్‌ను పంపించినట్లు తెలిపింది. ఫిజికల్ ఎంట్రీ పాస్ ప్రింట్ చేసి ఇస్తామని తెలిపింది. దీని కోసం ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించాలని చెప్పింది.

### ప్రసాదం ఏమిటంటే...

బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా స్పెషల్ తెప్లా(చపాతీలు), బాదం మిఠాయిలు, మటర్ కచోరీ వంటివాటిని భక్తులకు ప్రసాదంగా పంచుతారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్ నాగభూషణం రెడ్డి సమర్పించిన 1,265 కేజీల లడ్డూలను కూడా ప్రసాదంగా అందజేస్తారు.

### అత్యంత ఖరీదైన రామాయణ గ్రంథం

బుక్ సెల్లర్ మనోజ్ సతి ప్రత్యేక శ్రద్ధతో వాల్మీకి రామాయణం గ్రంథాన్ని ముద్రించి అయోధ్యలో అమ్మకానికి పెట్టారు. దీని ఖరీదు రూ.1.65 లక్షలు అని ఆయన చెప్పారు. దీనిని మూడు పెట్టెల్లో పెట్టి ఇస్తామన్నారు. ఈ పెట్టెలు రామాలయాన్ని పోలి ఉంటాయన్నారు. ఫ్రాన్స్‌లో తయారైన కాగితం, జపాన్ నుంచి తెప్పించిన సిరాతో దీనిని ముద్రించామన్నారు. అమెరికన్ వాల్‌నట్ వుడ్, కుంకుమ పువ్వుతో డిజైన్ చేశామన్నారు. 45 కేజీల బరువు గల ఈ పుస్తకం 400 సంవత్సరాలకుపైగా మన్నుతుందని చెప్పారు.

### ప్రాణప్రతిష్ఠ నాడు జరిగే పూజా కార్యక్రమాలు

**దర్శనం, హారతి సమయాలు**

**మేలుకొలుపు, శృంగార హారతి:** ఉదయం 6.30 గంటలకు

**భోగ హారతి:** మధ్యాహ్నం 12 గంటలకు

**సంధ్యా హారతి :** సాయంత్రం 7.30 గంటలకు

**దర్శన వేళలు:** ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు, అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు

### ఆన్‌లైన్‌లో దర్శనం పాస్ బుకింగ్

- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
- మొబైల్ నంబరుతో లాగిన్ అవాలి. అనంతరం ఓటీపీ వస్తుంది.
- హారతి లేదా దర్శనం కోసం స్లాట్‌ను బుక్ చేసుకోవడానికి 'మై ప్రొఫైల్' పై క్లిక్ చేయాలి.
- దర్శనం లేదా హారతి కోసం కోరుకుంటున్న తేదీని ఎంపిక చేసుకోవాలి.
- భక్తుల వ్యక్తిగత వివరాలను సమర్పించాలి.
- హారతి సమయానికి ముందు రామాలయం ప్రాంగణంలోని కౌంటర్ వద్ద పాస్‌ను తీసుకోవాలి.

## ఎక్కడ చూసినా రామాలయం చిత్రాలే!

అయోధ్యలో బ్యాంకులు, వ్యాపార సంస్థలు సైతం ఆధ్యాత్మిక భావాన్ని పంచుతున్నాయి. రామాలయం చిత్రాలతో భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. రామ్ పథ్‌లో గురువారం ప్రారంభమైన ఓ బ్యాంకును రామ జన్మభూమి శాఖగా పేర్కొన్నారు. వ్యాపార సంస్థలు కూడా తమ విజిటింగ్ కార్డులు, పోస్టర్లు, కేలండర్లు, సైనేజెస్‌లో రామాలయం బొమ్మను ముద్రించాయి. బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు చేసిన పోస్టర్‌లో 'ప్రభు శ్రీరాముని పావన నగరానికి స్వాగతం' అని రాశారు. సాధారణ ప్రజానీకం కూడా తమ మొబైల్ ఫోన్ కాలర్ ట్యూన్లుగా రాముని పాటలనే పెట్టుకుంటున్నారు.



# ఒకే ఆలయంలో 2 విగ్రహాలా?

## అయోధ్య ఆలయంలో కొత్త విగ్రహ స్థాపనపై శంకరాచార్య

## ఉత్సవ, మూల విరాట్టు రెండూ ఉండొచ్చన్న ఆలయ ట్రస్ట్

*అయోధ్య రామాలయంలో కొత్త విగ్రహం ఏర్పాటుపై జ్యోతిర్మఠ్ శంకరాచార్య స్వామి శ్రీ అవిముక్తేశ్వరానంద సరస్వతి అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడ ఇప్పటికే రామ్‌లల్లా వరిజ్మాన్ ఉండగా, కొత్త విగ్రహాన్ని ఎలా ప్రాణప్రతిష్ఠ చేస్తారని ప్రశ్నిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు ఆయన లేఖ రాశారు. అయితే ఉత్సవ, మూల విరాట్టు విగ్రహాలు రెండూ ఉండొచ్చని ఆలయ ట్రస్ట్ వివరణ ఇచ్చింది. మరోవైపు బాల రాముడి విగ్రహం ఫొటోలు లీక్ కావడంపై ఆలయ ప్రధాన పూజారి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ట్రస్ట్ అంతర్గత విచారణ చేపట్టింది.*

న్యూఢిల్లీ, జనవరి 20: అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు రెండు రోజుల ముందు కొత్త విగ్రహ ఏర్పాటుపై జ్యోతిర్మఠ్ శంకరాచార్య స్వామి శ్రీ అవిముక్తేశ్వరానంద సరస్వతి అభ్యంతరం వ్యక్తంచేశారు. అక్కడ ఇప్పటికే రామ్‌లల్లా వరిజ్మాన్ ఉండగా, కొత్త విగ్రహాన్ని ఎలా ప్రాణప్రతిష్ఠ చేస్తారని ప్రశ్నిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు ఆయన లేఖ రాశారు. 1949లో జరిపిన తవ్వకాల్లో అయోధ్య పాత రామలయం ప్రాంతంలో రామ్‌లల్లా వరిజ్మాన్ (బాలరాముడు) విగ్రహం బయటపడింది. ఆ విగ్రహమే ఇప్పటివరకు పూజలందుకొంటూ వస్తున్నది. కొత్త ఆలయంలో ఆ విగ్రహాన్ని కాకుండా కొత్త విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. అలా చేస్తే మరి పాత విగ్రహాన్ని ఏం చేస్తారని తన లేఖలో శంకరాచార్య ప్రశ్నించారు. గర్భ గుడిలో ఇలా కొత్త విగ్రహాన్ని ఏర్పాటుచేయటం శతాబ్దాల నాటి విగ్రహాన్ని అవమానించటమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఏడాది క్రితమే ఆలయంలో కొత్త విగ్రహం పెడుతున్నట్టు ట్రస్టు ప్రకటించిన సమయంలో చాలామంది ఇదే అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నాడు ట్రస్టు సమాధానం కూడా ఇచ్చింది. 'విగ్రహాలు రెండు రకాలు.. ఒకటి ఉత్సవ విగ్రహం.. రెండోది మూల విరాట్టు. మూల విరాట్టును ఎక్కడికీ ఎప్పటికీ కదిలించకూడదు. ఉత్సవ విగ్రహాన్ని శోభాయాత్రల సమయంలో బయటకు తీసుకొస్తారు. రామ్‌లల్లా చాలా చిన్నగా ఉంటుంది. అందుకే భక్తులకు 19 అడుగుల దూరం నుంచి కూడా కనిపించేలా గర్భగుడిలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నాం. రామ్‌లల్లాను కూడా గర్భగుడిలోనే ఒక పీఠంపై ఉంచుతాం' అని 2023, ఏప్రిల్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యుడు, విశ్వ హిందూ పరిషత్ నేత కామేశ్వర్ చౌపాల్ వివరణ ఇచ్చారు.

### రామ్‌లల్లా ఫొటో లీక్‌పై దర్యాప్తు చేపట్టాలి

ప్రతిష్ఠాపనకు ముందే కండ్లకు ఆచ్ఛాదన లేకుండా ఉన్న బాలరాముడి విగ్రహం ఫొటోలు లీక్ కావడంపై దుమారం రేగుతున్నది. దీనిపై శ్రీరామ జన్మభూమి ప్రధాన పూజారి ఆచార సత్యేంద్ర దాస్ శనివారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రామ్‌లల్లా పూర్తి ఫొటో బయటకు రావడంపై విచారణ చేయాలని, ఇది ఎవరు చేశారో తేల్చాలని అన్నారు. ప్రస్తుతం గర్భగుడిలోకి చేర్చిన బాలరాముడి విగ్రహం వస్త్రాలతో కప్పి ఉంచామని, ప్రాణప్రతిష్ఠ సమయంలోనే ఆ వస్త్రాన్ని తొలగిస్తామని తెలిపారు. అయితే అంతకుముందే కండ్లకు ఆచ్ఛాదన లేకుండా ఫొటోలు బయటకు రావడం సరికాదని, ప్రాణప్రతిష్ఠకు ముందు కండ్లు కనిపించకూడదని పేర్కొన్నారు. బాలరాముడి పూర్తి రూపం కనిపించే ఫొటోలు శుక్రవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొన్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అంతర్గత విచారణ చేపట్టినట్టు తెలుస్తున్నది. ఆలయ ప్రాంగణంలో నిర్మాణ పనుల్లో భాగంగా ఉన్న అధికారులు ఈ ఫొటోను లీక్ చేసి ఉంటారని ట్రస్ట్ అనుమానిస్తున్నది.

### రామయ్యకు చేయించిరి అపురూప కానుకలు

అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా దేశ విదేశాల నుంచి వివిధ వర్గాల ప్రజలు, ఆలయాలు, సంస్థలు శ్రీరాముడికి, ఆలయానికి విలువైన, అపురూపమైన కానుకలు సమర్పించారు. కశ్మీరు ముస్లిం సోదరులు సేంద్రియ పద్ధతిలో పండించిన రెండు కిలోల కుంకుమ పువ్వును పంపించారు. తమిళనాడులోని పట్టు వస్త్రాల తయారీదారులు పట్టు దుప్పటిపై రామాలయాన్ని చిత్రీకరించి పంపించారు. ఆఫ్ఘనిస్థాన్ రాజధాని నగరం కాబూల్‌లో ప్రవహించే కుభా నదీ జలాలను అక్కడివారు పంపించారు. కనౌజ్ నుంచి అనేక రకాల అత్తరులు, అమరావతి నుంచి 500 కేజీల కుంకుమ, ఢిల్లీలోని రామాలయాల నుంచి సేకరించిన ధాన్యం రామాలయానికి చేరుకున్నాయి. అదేవిధంగా 108 అడుగుల పొడవైన అగరుబత్తీ, 2,100 కిలోల గంట, 1,100 కేజీల దీపం, బంగారు పాదుకలు, 10 అడుగుల తాళం, ఏక కాలంలో 8 దేశాల సమయాన్ని తెలిపే గడియారం కూడా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు చేరుకున్నాయి. సీతమ్మ జన్మస్థలం నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి 3 వేలకు పైగా బహుమతులు వచ్చాయి. వీటిలో వెండి పాదరక్షలు, ఆభరణాలు, వస్త్రాలు ఉన్నాయి. శ్రీలంకలోని అశోక వాటిక ప్రత్యేక కానుకను సమర్పించింది. నాగ్‌పూర్ చెఫ్ విష్ణు మనోహర్ అయోధ్యలో 7,000 కేజీల రామ్ హల్వా తయారు చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి (64) బంగారు పూత పూసిన పాదరక్షలు సమర్పించారు.

### తప్పుడు సమాచారంపై జాగ్రత్త!

న్యూఢిల్లీ: రామ మందిర ప్రారంభోత్సవం నేపథ్యంలో కేంద్రం మీడియా, సోషల్ మీడియా సంస్థలకు శనివారం పలు సూచనలు జారీ చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి వార్తల ప్రసారం, సమాచారం ప్రచురణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, తప్పుడు విషయాలను అడ్డుకోవాలని సూచించింది. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే, నకిలీ సందేశాలు విస్తృతంగా వ్యాప్తి చెందడాన్ని గుర్తించామని, ఇవి మత సామరస్యాన్ని, శాంతి భద్రతలను దెబ్బతీస్తాయని కేంద్ర ఐటీ, ప్రసార మంత్రిత్వ శాఖ పేర్కొన్నది.

### 'ప్రసాదం' ప్రకటనలపై అమెజాన్ చర్యలు

న్యూఢిల్లీ: అయోధ్య ప్రసాదం పేరుతో స్వీట్ల అమ్మకంపై కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీ(సీసీపీఏ) జారీ చేసిన నోటీసులపై ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ స్పందించింది. తమ విధానానికి అనుగుణంగా అటువంటి లిస్టింగ్‌లపై తగిన చర్యలు తీసుకొంటున్నట్టు శనివారం పేర్కొన్నది. కొంత మంది అమ్మకందారులు పెట్టిన తప్పుదోవ పట్టించే ఉత్పత్తులకు సంబంధించి సీసీపీఏ నుంచి నోటీసు వచ్చిందని పేర్కొన్న అమెజాన్.. ఉల్లంఘనకు పాల్పడిన వారిపై దర్యాప్తు చేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపింది.

### బియ్యపు గింజలతో అయోధ్య రామాలయం



*జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ అద్భుతాన్ని ఆవిష్కరించారు. దాదాపు 60 గంటలపాటు శ్రమించి 16 వేలకు పైగా బియ్యపు గింజలతో అయోధ్య రామమందిరాన్ని నిర్మించారు. దయాకర్ తన సూక్ష్మ కళతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు.*
*- జగిత్యాల టౌన్*

## ఉగ్రమూకల బెదిరింపులు

**నిఘా వర్గాల అప్రమత్తం**

న్యూఢిల్లీ, జనవరి 20: అమాయక ముస్లింలను చంపిన తర్వాత అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభించుకొంటున్నారంటూ పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు గురుపత్వంత్ సింగ్ పన్నూకు చెందిన నిషేధిత ఉగ్ర సంస్థ ఎస్ఎఫ్‌జేతో సంబంధాలు ఉన్న ముగ్గురు వ్యక్తులను ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అయోధ్యలో అరెస్టు చేసింది. ఆయోధ్యలో విధ్వంసం సృష్టిస్తామని సిక్కు వేర్పాటువాది పన్నూ హెచ్చరించడంతో నిందితులు పన్నూ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్టు తెలిసిందని తెలిపాయి. ఈ నేపథ్యంలో అయోధ్యలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రస్తుతం అయోధ్యలో పరిస్థితి నియంత్రణలో ఉన్నదని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకొన్నట్టు నిఘా వర్గాలు వెల్లడించాయి.

### 22న ఏయే రాష్ట్రాల్లో సెలవంటే..

అయోధ్య: 22న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటికే ఒంటిపూట సెలవును ప్రకటించారు. కొన్ని రాష్ట్రాలు పూర్తిగా, మరికొన్ని మధ్యాహ్నం 2.30 వరకు సెలవిచ్చాయి. యూపీ, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, పుదుచ్చేరి పూర్తి సెలవు ప్రకటించగా, గుజరాత్, రాజస్థాన్, త్రిపుర, ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఒడిశా సగం రోజు సెలవు ఇచ్చాయి. ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ పాఠశాలలకు సెలవు ఇచ్చాయి. తమ సంస్థల ఉద్యోగులకు రిలయన్స్ సోమవారం సెలవు ప్రకటించింది. రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం స్టాక్ మార్కెట్లు తెరుచుకోవు. దానికి బదులుగా సెలవుదినమైన శనివారం స్టాక్‌మార్కెట్లు పనిచేశాయి.

### కాన్పుకూ అదే ముహూర్తం

హైదరాబాద్ సిటీబ్యూరో(నమస్తే తెలంగాణ): బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అదే రోజు అదే ముహూర్తానికి హైదరాబాద్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పండంటి బిడ్డకు జన్మనిచ్చేందుకు కొందరు గర్భిణులు సిద్ధమయ్యారు. 22న తమకు పురుడు పోయాలని డాక్టర్లను కోరుతున్నారు. సోమవారం మధ్యాహ్నం 12.20 నిమిషాలకు డెలివరీ జరగాలని ఓ జంట సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్‌లో అడ్మిషన్ తీసుకుంది.

### సీతారాములకు పోచంపల్లి పట్టువస్త్రాలు



*అయోధ్య సీతారామచంద్రులకు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి చేనేత కళాకారులు పట్టువస్త్రాలు నేస్తున్నారు. హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లోగల హనుమాన్ మందిరంలో పోచంపల్లి మద్దెలమ్మ దేవి దేవాలయ కమిటీ ప్రతినిధి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఈ వస్త్రాల తయారీ సోమవారానికి పూర్తవుతుంది.*
*- భూదాన్ పోచంపల్లి*

## అయోధ్యలోనే కాదు ఒడిశాలోనూ..

భువనేశ్వర్: ఒడిశాలోని నారాయణ్ గఢ్ జిల్లా, ఫతేగఢ్ గ్రామంలో నిర్మితమైన రామాలయం ప్రారంభోత్సవం కూడా సోమవారం జరగనున్నది. కొండపైన నిర్మితమైన ఈ దేవాలయం ఎత్తు 165 అడుగులు. దీని నిర్మాణం 2017లో ప్రారంభమైంది.

### విద్యుత్తు కాంతుల్లో కనువిందు

అయోధ్య ఆలయం లోపలి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. సమ్మోహనపరిచే కాంతులతో రామాలయం కనువిందు చేస్తున్నది. సహజమైన పుష్పాల సౌందర్యం కట్టిపడేస్తున్నది. ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అమెరికాలో 1,000 ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

### 300 కోట్ల ఏండ్లనాటి శిలతో..

అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠితమవుతున్న బాలరాముని విగ్రహాన్ని 300 కోట్ల ఏండ్లనాటి శిలతో తయారు చేసినట్లు మైసూరు విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర శాఖ మాజీ ప్రొఫెసర్ శ్రీకంఠప్ప చెప్పారు.

### బాబ్రీ మసీదును క్రమపద్ధతిలో లాగేసుకొన్నారు: ఒవైసీ

బెంగళూరు, జనవరి 20: అయోధ్య రామ జన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠ వృత్తాంతాన్ని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సవాల్ చేశారు. బాబ్రీ మసీదును ఒక క్రమ పద్ధతిలో స్వాధీనం చేసుకొన్నారని ఆరోపించారు. కర్ణాటకలోని కలబురగిలో శనివారం మీడియాతో మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు సమయంలో ఆలయం లేదని పేర్కొన్నారు. బాబ్రీ మసీదును కూల్చకుంటే.. ఈ రోజున జరుగుతున్న వాటిని ముస్లింలు చూడాల్సి వచ్చేది కాదన్నారు. బాబ్రీ మసీదులో ముస్లింలు 500 ఏండ్లకు పైగా నమాజ్ చేశారని, యూపీ సీఎంగా జీబీ పంత్ ఉన్న సమయంలో మసీదులో విగ్రహాలను ఉంచారని పేర్కొన్నారు. అయోధ్య కలెక్టర్‌గా ఉన్న నాయర్ మసీదును మూసివేసి, అక్కడ పూజలు ప్రారంభించారని ఒవైసీ అన్నారు. రామ మందిరం గురించి మహాత్మాగాంధీ కూడా ఎప్పుడూ ప్రస్తావించలేదని, ఒక క్రమ పద్ధతిలో బాబ్రీ మసీదును భారతీయ ముస్లింల నుంచి లాగేసుకొన్నారని పేర్కొన్నారు.



# వాల్మీకి రామాయణానికి సాక్షి 'గూగుల్'

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): రామాయణం అది నిజంగానే జరిగిందని 'గూగుల్ మ్యాప్స్' రిజల్ట్స్ కూడా ధ్రువపరుస్తున్నాయి. రావణుడిని శ్రీరాముడు హతమార్చిన రోజును విజయ దశమిగా, లంక నుంచి రాముడు కాలినడకన అయోధ్యకి చేరుకున్న సందర్భంగా దీపావళి జరుపుకొంటామన్న విషయమూ విదితమే. అయితే, ఈ రెండు పండుగల మధ్య 20-21 రోజుల ఎడం ఉంటుంది. ఇప్పుడు ఒక్కసారి గూగుల్ మ్యాప్స్‌లో శ్రీలంక నుంచి అయోధ్యకి కాలినడకన చేరుకోవాలంటే ఎన్నిరోజులు పడుతుందో వెతకండి. గూగుల్ మ్యాప్స్ 21 రోజులు చూపిస్తుంది.*

### రావణుడే మొదట విమానాన్ని నడిపాడా?

*పురాణాల్లో చెప్పుకొన్నట్టు పుష్పక విమానం నిజంగానే ఉండేదా? 1903లో రైట్ బ్రదర్స్ విమానాన్ని నడపడానికి ముందే.. వేల ఏండ్ల కిందటే లంకాధీశుడైన రావణాసురుడు విమానాన్ని నడిపాడా? గత కొన్నేండ్లుగా శ్రీలంకలో విరివిగా ప్రచారమవుతున్న ఈ కథలకు శాస్త్రీయపరంగా తగిన ఆధారాలు మరికొద్ది రోజుల్లో దొరికే అవకాశమున్నది. మూడేండ్ల కిందట ప్రారంభమైన 'ఏవియేటర్ రావణ' ప్రాజెక్టు చివరి దశకు చేరుకొన్నది. పరిశోధనలో కనుగొన్న పూర్తి వివరాలను త్వరలో ప్రకటించనుంది.*



అందంగా వెలుగులీనుతున్న అయోధ్యలోని సరయు నది తీరం

### హనుమంతుడంటే వారికి ఎంతో కోపం!

*ఉత్తరాఖండ్ చమోలీ జిల్లాలోని ద్రోణగిరి పర్వతాల మధ్య ఉండే ద్రోణగిరి అనే కుగ్రామ ప్రజలందరికీ హనుమంతుడు అంటే ఎంతో కోపం. యుద్ధంలో స్పృహ కోల్పోయిన లక్ష్మణుడి కోసం ద్రోణగిరి పర్వతాల్లోని సంజీవని మొక్క కోసం వచ్చిన ఆంజనేయుడు ఏకంగా పర్వతాన్ని మోసుకెళ్లాడని, దీంతో సంజీవని మొక్కతో పాటు ఇంకా ఎన్నో ఔషధ మూలికలు కూడా ఇక్కడి నుంచి తరలిపోయాయని గ్రామస్తులు వాపోయారు. అందుకే, తమ గ్రామంలో ప్రజలు తరచూ వ్యాధులబారిన పడుతున్నారని, అందుకే, దీనికి కారణమైన హనుమంతుడిపై తాము కోపంగా ఉన్నట్టు చెప్పుకొచ్చారు.*

### సూపర్ హ్యూమన్ అచీవ్‌మెంట్ 'రామసేతు'!

*భారత్, శ్రీలంకలను కలుపుతున్నట్టుగా ఉండే 'రామసేతు' పై అనుమానాలకు పురాతత్వ శాఖకు చెందిన డాక్టర్ అలెన్ లెస్టర్ స్పష్టత ఇచ్చారు. రామసేతు సహజసిద్ధంగా ఏర్పడినట్టు లేదని, దానిపై పేర్చిన రాళ్లు మాత్రం వేరే చోటు నుంచి తీసుకొచ్చి పేర్చినట్టుగా ఉన్నాయని అన్నారు. రామసేతు ఓ 'సూపర్ హ్యూమన్ అచీవ్‌మెంట్' అని డిస్కవరీ సైన్స్ ఛానెల్ అభివర్ణించింది.*